# మనం హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

బుధవారం | 17 | జూన్ | 2026 పేజీలు: 8





# మల్లారెడ్డి కాలేజీకి ఫైన్

**మల్లారెడ్డి కాలేజీలో విద్యార్థికి ఫీజు వేధింపులు..**

**రూ.1.10 లక్షలు ఫైన్ వేసిన వినియోగదారుల కమిషన్**

*మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి వినియోగదారుల కమిషన్ బిగ్ షాక్ ఇచ్చింది. ఓ విద్యార్థి విషయంలో మల్లారెడ్డి కాలేజీ అదనపు ఫీజు కోసం వేధింపులు చేస్తున్నట్లు ఆరోపణలు రాగా.. భారీగా జరిమానా పడింది. ఆ విద్యార్థికి రూ.1.10 లక్షలు చెల్లించాలని మల్లారెడ్డి కాలేజీని వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. కోర్సు మధ్యలో ఆపేసిన విద్యార్థికి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా మల్లారెడ్డి కాలేజీ.. అదనపు ఫీజు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. హైదరాబాద్ నగర శివారులో పేరు గాంచిన మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి.*

2




## జలమండలి ఎండీ
# ఆకస్మిక తనిఖీ

**అధికారులకు కీలక ఆదేశాలు**

2



# బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ మను చౌదరి

2



## ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి
# ఆషాడ మాస బోనాలు

సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాల ఉత్సవాలను ఆగస్టు 2 వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఆలయ ఈవో మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పండితులు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం ఆషాఢమాస బోనాల ఉత్సవాల వివరాలను తెలియజేస్తూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు లేఖను అందజేశారు. జులై 19 వ తేదీన ఘటాల ఊరేగింపు ప్రారంభం అవుతుందని, ఆగస్టు 2 వ తేదీన అమ్మవారికి బోనాల సమర్పణ, 3 వ తేదీన రంగం (భవిష్య వాణి) ఉంటాయని ఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, రాం మోహన్ యాదవ్ తదితరులు ఉన్నారు.



## నీట్ పరీక్షను సజ్జవుగా నిర్వాణకు
# ఏర్పాట్లు చేయాలి




**జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు జారీ**

2

# మల్లారెడ్డి కాలేజీకి ఫైన్




### మల్లారెడ్డి కాలేజీలో విద్యార్థికి ఫీజు వేధింపులు.. రూ.1.10 లక్షలు ఫైన్ వేసిన వినియోగదారుల కమిషన్

హైదరాబాద్,జూన్16(మనం న్యూస్)ః మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి వినియోగదారుల కమిషన్ బిగ్ షాక్ ఇచ్చింది. ఓ విద్యార్థి విషయంలో మల్లారెడ్డి కాలేజీ అదనపు ఫీజు కోసం వేధింపులు చేస్తున్నట్లు ఆరోపణలు రాగా.. భారీగా జరిమానా పడింది. ఆ విద్యార్థికి రూ.1.10 లక్షలు చెల్లించాలని మల్లారెడ్డి కాలేజీని వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. కోర్సు మధ్యలో ఆపేసిన విద్యార్థికి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా మల్లారెడ్డి కాలేజీ.. అదనపు ఫీజు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. హైదరాబాద్ నగర శివారులో పేరు గాంచిన మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. అయితే ఆ ఇంజినీరింగ్ కాలేజీలో జాయిన్ అయిన ఓ విద్యార్థి.. తన వ్యక్తిగత కారణాలతో కోర్సు పూర్తి చేయకుండా మధ్యలోనే చదువును ఆపేశాడు. మొదటి సంవత్సరం ఫీజు చెల్లించిన ఆ విద్యార్థి.. ఫస్ట్ సెమిస్టర్ పూర్తి కాగానే.. తన చదువును నిలిపివేశాడు. ఈ క్రమంలోనే అడ్మిషన్ సమయంలో ఇచ్చిన తన ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వాలని మల్లారెడ్డి




కాలేజీ యాజమాన్యాన్ని కోరగా.. అదనపు డబ్బులు చెల్లించాలని.. అలా డబ్బులు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తేల్చి చెప్పారు. దీంతో మల్లారెడ్డి కాలేజీపై వినియోగదారుల కమిషన్‌ను బాధిత విద్యార్థి ఆశ్రయించగా.. కాలేజీకి రూ.1.10 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. హైదరాబాద్ నాంపల్లికి చెందిన రాకేష్ వర్మ అనే వ్యక్తి.. తన కుమారుడిని మైసమ్మగూడలో ఉన్న మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదివించేందుకు 2021 అక్టోబర్లో అడ్మిషన్ తీసుకున్నాడు. బీటెక్ ఏఐ, మెషీన్ లెర్నింగ్ కోర్సులో ఆ విద్యార్థి చేరాడు. అడ్మిషన్ సమయంలోనే బీటెక్ ఫస్టియర్ ట్యూషన్ ఫీజు కింద రూ.80 వేలు చెల్లించాడు. ఈ క్రమంలోనే తన టెన్త్ క్లాస్, ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్లను కూడా మల్లారెడ్డి కాలేజీ సిబ్బంది తీసుకున్నారు. ఈ క్రమంలోనే బీటెక్ జాయిన్ అయిన ఆ విద్యార్థి.. తొలి సెమిస్టర్ పూర్తి చేశాడు. ఆ తర్వాతే అతడి కుటుంబానికి ఆర్థిక సమస్యలు వచ్చాయి. ఇక అతడి చదువుకు ఖర్చు చేసేందుకు ఆ కుటుంబం ఏమాత్రం డబ్బులు ఇవ్వలేకపోయింది. దీంతో తన చదువును మధ్యలోనే ఆపేయాలని ఆ విద్యార్థి నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే తన టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లను ఇవ్వాలంటూ బాధిత విద్యార్థి, అతడి తండ్రి.. కాలేజీ యాజమాన్యాన్ని సంప్రదించాడు. అందుకు కాలేజీ యాజమాన్యం ఒప్పుకోలేదు. ఫస్టియర్ ఫీజు కింద రూ.80 వేలు చెల్లించగా.. మరో రూ.80 వేలు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీ యాజమాన్యం వేధింపులకు దిగింది.ఈ క్రమంలోనే కాలేజీ తీరుపై విసుగు చెందిన రాకేష్ వర్మ, అతడి కుమారుడు.. గతేడాది సెప్టెంబరులో హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్-1ను ఆశ్రయించారు. దీంతో మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి వినియోగదారుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులు రాగానే కాలేజీ యాజమాన్యం ఆ విద్యార్థిని పిలిచి.. ఒరిజినల్ సర్టిఫికెట్లను తిరిగిచ్చేసింది. ఆ తర్వాత తమపై వేసిన కేసును కొట్టేయాలని విజ్ఞప్తి చేసింది. అయితే మల్లారెడ్డి కాలేజీ యాజమాన్యం అతడికి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా 4 ఏళ్లుగా తీవ్ర మానసిక క్షోభకు గురి చేశారని పేర్కొన్న వినియోగదారుల కమిషన్.. కాలేజీకి భారీ జరిమానా విధించింది.

# జలమండలి ఎండీ ఆకస్మిక తనిఖీ

### అధికారులకు కీలక ఆదేశాలు

హైదరాబాద్,జూన్16(మనం న్యూస్)ః హైదరాబాద్ నగరంలోని ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని నవీన్ నగర్ కాలనీ, ఆనంద్‌నగర్ ప్రాంతాల్లో నెలకొన్న సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యలపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రోడ్లపై నిలిచిపోతున్న మురుగు నీటి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎండీ, సంబంధిత అధికారులతో కలిసి సమస్యల మూలకారణాలపై సమీక్ష నిర్వహించారు. సీవరేజ్ లైన్లలో పేరుకుపోయిన పూడిక కారణంగా పలు ప్రాంతాల్లో ఓవర్‌ఫ్లో సమస్యలు తలెత్తుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక డీ-సిల్టింగ్ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వారానికి కనీసం ఒక్కసారైనా ప్రతి మ్యాన్‌హోల్‌ను తనిఖీ చేసి డీ-సిల్టింగ్ నిర్వహించాలని సూచించారు. డీ-సిల్టింగ్ చేపట్టిన మురుగు లైన్‌లవివరాలు, మ్యాన్‌హోల్స్‌లో నుంచి తొలగించిన పూడిక పరిమాణం, చేపట్టిన నిర్వహణ పనుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. తరచూ ఓవర్‌ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్లను గుర్తించి వాటిపై రెడ్ పెయింట్‌తో వేయాలని ఎండీ ఆదేశించారు. దీని ద్వారా సమస్యాత్మక మ్యాన్‌హోళ్లను త్వరితగతిన గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కస్టమర్ కేర్‌కు తరచూ ఫిర్యాదులు అందుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అటువంటి సమస్యాత్మక ప్రాంతాలపై వారానికి ఒకసారి సమీక్ష నిర్వహించి, సమస్యల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో సంబంధిత ప్రాంతాల్లో సమగ్ర సర్వే నిర్వహించి, అవసరమైన సాంకేతిక ప్రతిపాదనలతో కూడిన నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే సీవరేజ్ లైన్‌ల అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులకు సూచించారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా సీవరేజ్ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని, ఫీల్ స్థాయిలో అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేయాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు.

### కూలిపోయిన 15 ఏళ్ల మ్యాన్ హోల్..

అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన పరిశీలనలో, సుమారు 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఒక డీప్ మ్యాన్‌హోల్ దెబ్బతిన్నట్లు గుర్తించారు. దీంతో ఆ ప్రాంతంలో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యలు తలెత్తుతున్నట్లు అధికారులు వెల్లడించారు. దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌ను పునర్నిర్మించడం ద్వారా ఆ ప్రాంతంలో తరచూ సంభవిస్తున్న సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యకు గణనీయంగా పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ ప్రభులతోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, జూన్ 16 ( మనం జిల్లా ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమానికి జిల్లాలో 22 పాఠశాలల ఎంపికైన సందర్భంగా కేంద్రీకృత వంటగది నిర్మాణానికి గాను స్థల సేకరణ నిమిత్తం ఆలియాబాదు, కేశవరం లోని మూసిఉన్న బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అంతటా అల్పాహారాన్ని అందించే విధంగా ఉండేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణానికి గాను స్థల పరిశీలనకై శామీర్ పేట్, మూడుచింతలపల్లి మండలాలలోని హాస్టల్స్ ను తనిఖీ చేశామన్నారు. ఈ హాస్టల్స్ ఎప్పటి నుండి మూసి ఉన్నాయని, ఎంత స్థలం ఉందని బిసి వెల్ఫేర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు హాస్టల్స్ స్థల వివరాల నివేదికను తనకు అందజేయాలని సంబంధిత ఎంఆర్ఓలకు సూచించారు.



అనంతరం కేశవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసారు. విద్యార్థులు ఎంత మంది హాజరైనారని సంబంధితగ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ విద్యా సంవత్సరంలో ఎన్నికొత్త అడ్మిషన్లు అయ్యాయని అడిగారు. పిల్లలతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది, ఆడుకోవడానికి పరికరాలు ఉన్నాయా, ఏమైనా కావాలా అని విద్యార్థులను అడుగగా, ఫుట్ బాల్, క్రికెట్ కిట్లు కావాలని విద్యార్థులు కోరగా, కలెక్టర్ అందిస్తామన్నారు. ఈ పర్యటనలో జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణి, శామీర్ పేట్ ఎంఆర్ఓ శ్రీనివాస్, మూడుచింతలపల్లి ఎంఆర్ఓ మహమ్మద్ ఇద్రీస్, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహార నిర్వహణ కాంట్రాక్టు ఎజెన్సీ మన్న ట్రస్ట్ వారితో కలెక్టర్ మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకొని అవసరమైన సలహాలు సూచనలు అందజేసారు.

# నీట్ పరీక్షను సజ్జవుగా నిర్వాణకు ఏర్పాట్లు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు జారీ

మేడ్చల్, జూన్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): ఈనెల 21 న జరుగనున్న నీట్ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షకు జిల్లా నుండి 3 వేల 311 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నియమ



నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభర్థులకు కరెంట్, మంచినీరు అందుబాటులో ఉంచాలని, కేంద్రాల వద్ద పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్య అధికారులు మెడికల్ కిట్, అంబులెన్సలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్ వంటి వాటిని అందుబాటులో ఉండేలా డిడబ్ల్యూఓ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఓలు వెంకట్ రెడ్డ, శ్యాంప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టిఐసిసిఐ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో గిరిజన పారిశ్రామికవేత్తల అభివృద్ధిపై పారిశ్రామిక శాఖ అధికారులతో కీలక సమావేశం

హైదరాబాద్ ప్రతినిధి, జూన్ 16 (మనం న్యూస్) : TICCI (Tribal Indian Chamber of Commerce  Industry) తెలంగాణ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా. శ్రీనివాస్ ధారావత్ గారి నాయకత్వంలో ప్రతినిధి బృందం తెలంగాణ ఇండస్ట్రియల్ కమిషనర్ కార్యాలయంలో గౌరవనీయులు శ్రీ డి. శ్రీనివాస్ నాయక్  (అదనపు డైరెక్టర్) మరియు శ్రీ కోటేశ్వరరావు (జాయింట్ డైరెక్టర్)లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది.

ఈ సందర్భంగా గిరిజన యువతలో పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించడం, గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, MSME మరియు స్టార్టప్ రంగాలలో గిరిజనుల భాగస్వామ్యాన్ని పెంచడం, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, రుణాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాలు మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.





అలాగే గిరిజన పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, మెంటార్షిప్, మార్కెట్ లింకేజీలు, ప్రభుత్వ కొనుగోళ్లలో అవకాశాలు కల్పించే అంశాలపై ప్రతిపాదనలు సమర్పించారు. గిరిజన యువత ఉద్యోగాల కోసం వెతికే స్థాయి నుండి ఉద్యోగాలను కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సమావేశంలో ఆకాంక్ష వ్యక్తమైంది.

ఈ సమావేశంలో టిఐసిసిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. శ్రీనివాస్ ధారావత్, శ్రీ రాంచందర్, శ్రీ సురేష్, శ్రీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు పారిశ్రామిక సాధికారత - నిర్మాణానికి టిఐసిసిఐ కట్టుబడి ఉంది.

# హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) నాచారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ సోమవారం పరిశీలించారు. చెరువులోని నీటిని పూర్తిస్థాయిలో తొలగించిన అనంతరం ప్రస్తుతం ఐదు హిటాచీ యంత్రాలతో పూడిక తొలగింపు పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పనులను మరింత వేగవంతం చేసేందుకు ఇందిరానగర్ నుంచి హెచ్ఎంటి నగర్ వరకు ఎస్టీపీ పక్కన తాత్కాలిక రహదారి నిర్మిస్తున్నట్లు అధికారులు వివరించారు. అలాగే పటేల్కుంట నుంచి చెరువులోకి వచ్చే నీటిని ఇప్పటికే ట్రంక్ లైన్లోకి మళ్లించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాత్కాలిక రహదారి నిర్మాణం వల్ల భారీ వర్షాల సమయంలో ట్రంక్ లైన్ నుంచి నీరు చెరువులోకి వెళ్లకుండా కాలనీలోకి మళ్లే అవకాశం ఉందని సాయిజెన్ శేఖర్ గుర్తించారు. ముందస్తు జాగ్రత్త చర్యగా రహదారి కింద పైపులు ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్కు సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అషు తదితరులు పాల్గొన్నారు.




# రక్తదాన శిబిరానికి విశేష స్పందన

## భారీ సంఖ్యలో రక్తాన్ని దానం చేసిన మిమ్స్ విద్యార్థులు, సిబ్బంది

మేడ్చల్, జూన్ 16 ( మన జిల్లా ప్రతినిధి ):  ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లాలోని ఘన్ పూర్ లో ని మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.తమ వద్ద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, పని చేస్తున్న సిబ్బందికి రక్తదానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటూ సంస్థ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.







ఇందుకోసం హాస్పిటల్ లో మూడు రోజులుగా వీరందరికీ ప్రత్యేకంగా తరగతులు నిర్వహించడమే కాకుండా వారిని రక్తదానానికి ప్రోత్సహించారు. ప్రేరణ పొందిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొని నేడు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో వైద్య విద్య, నర్సింగ్ పారామెడికల్ కోర్సులలో చదువుకొంటున్న విద్యార్థి, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు.  అంతకు ముందు రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారికి ఉచితంగా బ్లడ్ గ్రూప్ , హిమోగ్లోబిన్ , హెచ్ఐవి , హెపటైటిస్ -బి ,హెపటైటిస్ -సి , సిఫిల్, మలేరియా మొదలైన పరిక్షలు చేశారు. అనంతరం వీరి ద్వారా హాస్పిటల్ లో చికిత్సకు వచ్చే రోగులకు ఉపయోగపడేలా వివిధ బ్లడ్ గ్రూపుల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించి భద్రపరిచారు.

ఈ సందర్బంగా మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డా. మాన్విత సింధు మాట్లాడుతూ రక్తదానం పై పలు అపోహలు చలామణిలో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా దానం చేసిన వారు నీరస పడిపోతారని, వారి శరీరంలో రక్తం తగ్గిపోతుందని, రోగ నిరోధక శక్తి కోల్పోయే ప్రమాదం ఉందనే అపోహలు పూర్తిగా అవాస్తమని వివరించారు.  రక్తదానం శరీరాన్ని మరింత ఆరోగ్యవంతంగా చేస్తుందని అలానే మరొక విలువైన ప్రాణాన్ని కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందనే విషయాన్ని అందరూ గ్రహించాలని సూచించారు.

అనంతరం కార్యక్రమంలో రక్తదానం చేసిన వారికి మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ తరపున సర్టిపికేట్ లు అందజేశారు.  మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ లోని పాథాలజీ విభాగపు అధిపతి డా. రాజశేఖర రెడ్డి నేతృత్వంలో బ్లడ్ బ్యాంకు ఇన్చార్జి డా. మాన్విత సింధు ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు సిబ్బంది శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.  ఈ కార్యక్రమంలో  ఎం ఐ ఎం ఎస్  ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కే శివరామకృష్ణ వారితో పాటూ , ఎంఐఎంఎస్  ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేందర్ సింగ్ నేగి  డా. గీత, ఇతర వైద్యులు, వైద్య  వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.







# సీతాఫల్మండిలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీతాఫల్ మండి ప్రాంతంలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సైబర్ మోసాలు, ఆన్లైన్ మోసగాళ్లు అనుసరిస్తున్న పద్ధతులు, వాటి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, వ్యక్తిగత బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ భద్రతపై సూచనలు అందించారు.

# సైబర్ నేరాల నివారణే లక్ష్యం

## అంబర్నగర్లో వారాసిగూడ పోలీసుల అవగాహన సదస్సు




సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) వారాసిగూడ పోలీసుల ఆధ్వర్యంలో అంబర్నగర్లోని గాంధీ విగ్రహం వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు. ముఖ్యంగా ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్వర్డు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని ఏపీకే (అ్యప) ఫైళ్లను మొబైల్లో ఇన్స్టాల్ చేయకూడదని హెచ్చరించారు. ఆన్లైన్ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు, ట్రేడింగ్ మరియు పెట్టుబడుల పేరుతో మభ్యపెట్టే స్కాములు, నకిలీ ఆన్లైన్ షాపింగ్ వెబ్సైట్ల మోసాలు, అలాగే ఇటీవల పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద కాల్స్, సందేశాలు లేదా లింక్లు వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారాసిగూడ అడ్మిన్ ఎస్ఐ మల్లికార్జున్, సైబర్ వారియర్ పీసీ యాకస్వామి, పెట్రో కార్ సిబ్బంది, బీట్ కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మీ సురక్ష కార్యక్రమం

సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) నాచారం పరిధిలోని పారిశ్రామిక వాడలోని రహేజా విస్టా వద్ద పోలీసుల ఆధ్వర్యంలో 'మీ సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్స్పెక్టర్ కె. ధనుంజయ్ హాజరై ప్రజలకు భద్రత, నేరాల నివారణ, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. స్థానిక ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని సూచనలు స్వీకరించారు. పరిసర ప్రాంతాల కమ్యూనిటీ పెద్దలు, మహిళలు, యువతతో పాటు సుమారు 150 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. పోలీసు-ప్రజల మధ్య సమన్వయాన్ని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో ఏఐ ఆధారిత ఔషధ ఆవిష్కరణ వర్క్‌షాప్ ముగింపు

సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆధునిక మాలిక్యులర్ మోడలింగ్, సిమ్యులేషన్ మరియు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఔషధ ఆవిష్కరణపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి హ్యాండ్స్-ఆన్ వర్క్షాప్ మంగళవారం విజయవంతంగా ముగిసింది. విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఫ్యాకల్టీ రిసోర్స్ డెవలప్మెంట్ (సీఎఫ్ఆర్డి) లో ఏఎన్ఆర్ఎఫ్ - పిఏఐఆర్, రూస 2.ఓ ఉస్మానియా యూనివర్సిటీ, మాలిక్యులర్ సొల్యూషన్స్ సంస్థల



సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వర్క్షాప్లో ప్రోటీన్ హోమాలజీ మోడలింగ్, స్ట్రక్చర్ బేస్డ్ డ్రగ్ డిజైన్, మాలిక్యులర్ డాకింగ్, ఫ్రీ ఎనర్జీ మెథడ్స్, మాలిక్యులర్ డైనమిక్స్ సిమ్యులేషన్స్, ఏఐ ఆధారిత సింథసిస్ ప్లానింగ్ వంటి అత్యాధునిక అంశాలపై శిక్షణ అందించారు. మాలిక్యులర్ సొల్యూషన్స్కు చెందిన నిపుణులు దినేష్ జయకుమార్, డా. ఫైజాన్ ఆర్. సయ్యద్ సాంకేతిక సెషన్లను నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు ఇతర విద్యాసంస్థల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొని ఆధునిక పరిశోధనా విధానాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ తరహా కార్యక్రమాలు పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేయడంతో పాటు అంతరశాఖ పరిశోధనలకు ఊతమిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# ఇది పాఠశాల నా... రాజకీయాలకు అడ్డనా..

**నాజరీన్ పాఠశాల వ్యవహారం**
**రాజకీయాలకు అడ్డగా**
**మారిన నాజరీన్ పాఠశాల**
**రెండు కుటుంబాల మధ్య నలుగుతున్న విద్యార్థులు**



మేడ్చల్, జూన్ 17 ( మనం జిల్లా ప్రతినిధి): ఆస్తుల మీద ఉన్న ప్రేమ.. పిల్లల భవిష్యత్తుపై ధ్యాస లేదు. ఇంకో ఒక రోజు అయితే పాఠశాల ప్రారంభమవుతున్న తరుణంలో పాఠశాల చుట్టూ రాజకీయం చుట్టుకుంది. ఈ పాఠశాలకు మేమే వారసులమంటూ ఇక్కడ రెండు కుటుంబాల మధ్య సై అంటే సై అంటూ ఒకరిపై ఒకరు చాలెంజ్ లు చేసుకుంటూ పాఠశాల వాతావరణ ని చెడగొడుతున్నారు. పాఠాలు చెప్పాల్సిన ప్రాంతంలో రాజకీయాలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వీరి రాజకీయాల వల్ల ఇప్పటికే భారత్ బైబిల్ కళాశాల మూతపడగా... ఇక తరువాయి పాఠశాల మూతపడడానికి సిద్ధంగా ఉంది. అయినా వీరికి ఆ ఆలోచన లేకుండా కేవలం ఆస్తికోసం రెండు వర్గాల వారు ప్రయత్నాలు చేస్తూ పాఠశాల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు.

**పాఠశాలల.. రాజకీయాలకు అడ్డనా ..**

అది పాఠశాలనా లేక రాజకీయాలకు అడ్డనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు వర్గాలు తమకున్న పలుకు బడిని ఉపయోగిస్తూ రాజకీయాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో రాజకీయపరంగా ఎమ్మెల్యే స్థాయి.. పోలీసులపరంగా డీజీపీ స్థాయి వరకు పైరవీలు చేస్తున్నారంటే ఇక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఈ గొడవల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారు. మేమే అసలైన వారసులం అంటూ ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీస్ కేసులను పెట్టుకుంటూ పాఠశాల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు.

**అసలు బీబీసీ లో జరుగుతుంది ఏంటి?**



1969 లో భారత్ బైబిల్ కళాశాల పేరుతో కళాశాలను ఏర్పాటు చేశారు. అనంతరం విదేశీయులు ఇచ్చిన విరాళాలతో 24 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి జీవ రత్నం బురుగ భారత్ బైబిల్ కళాశాల పేరుతో మేడ్చల్ జిల్లా డబిల్ పూర్ గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ కళాశాల ఉద్దేశం పేద క్రిస్టియన్ పిల్లలకు విద్యాబోధన చేయడం. 1969 తార్నాకలో ఈ భారత్ బైబిల్ కళాశాల ఏర్పాటు కాగా 1980లో జీడిమెట్ల లో నడిచింది.1998 నుండి 2022 వరకు శామ్యూల్ బురుగ డైరెక్టర్ గా ఉన్నారు. 2014 వరకు జీవరత్నం బురుగ తమ్ముడు శామ్యూల్ బురుగ కొనసాగారు. అప్పటి 2014 వరకు 3500 మంది విద్యార్థులకు విద్య బోధన అందించారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. వయసు మీద పడడంతో శామ్యూల్ బురుగ 2014లో డైరెక్టర్ పదవిని జాబ్ ఎల్ రెడ్డికి అప్పగించారు. అప్పటి నుంచి బీబీసీకి డైరెక్టర్ గా జాబ్ ఎల్ రెడ్డి రెడ్డి కొనసాగుతూ వచ్చారు. అయితే ఏమైందో తెలియదు కానీ జాబ్ ఎల్ రెడ్డి కి వ్యతిరేకంగా శామ్యూల్ బురుగ ప్రవర్తించడం మొదలుపెట్టారు. డైరెక్టర్ పదవి నుండి దిగిపోవాలి అంటూ శామ్యూల్ బురుగవర్గం పట్టుబడుతూ వచ్చింది. అయితే తాను వద్దన్నా తనకు 2014లో డైరెక్టర్ పదవిని అంటగట్టారని, ఇప్పుడు దిగిపొమ్మంటున్నారు అంటూ

జాబి ఎల్ రెడ్డి ఆరోపిస్తున్నారు. దీనితో వీరిద్దరి మధ్యల గత కొద్ది రోజుల నుండి వివాదం సాగుతుంది. ఇటీవల కళాశాల నుండి శామ్యూల్ బురుగ వర్గం జాబి ఎల్ రెడ్డి ని కళాశాల నుండి బయటకు పంపించారు. 2014 నుండి ఇంత ఇంతకాలం తానే పాఠశాలను నడిపించానని, పాఠశాలలో పనిచేసే సిబ్బందికి తానే జీతాలు ఇచ్చానని... సడన్ గా తనను పాఠశాల నుండి బయటకు పంపడం అన్యాయమని, ఇటీవల జాబు ఎల్ రెడ్డి కళాశాల గేటు ముందు ఆందోళనకు దిగారు. కళాశాలలోకి చుచ్చుకొనే వెళ్లే ప్రయత్నం చేశాడు. సామిల్ బుర్ర వర్గం దీనిని అడ్డుకున్నారు. అప్పటినుండి పోలీసులు రావడం గేటుకు తాళాలు వేసి ఉండడం పోలీసుల మధ్య సామిల్ దుర్గా వర్గం మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది, ఇదేవిధంగా జాబ్ ఎల్ రెడ్డిని సైతం అడ్డుకున్నారు.



**పాఠశాల వద్ద బౌన్సర్లకు ఏం పని**

పాఠశాల వద్ద కు మాజీ డైరెక్టర్, మాజీ ప్రిన్సిపల్ బౌన్సర్లతో రావడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. పాఠశాల వద్ద బౌన్సర్లకు ఏం పని అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బౌన్సర్లతో తిరుగుతున్నారు అంటే పరిస్థితి ఎంత దూరం వెళ్లిందో ఇట్టే అర్థమవుతుంది. పాఠశాల వద్దకు పోలీసులు రావడం, బౌన్సర్లు రావడం, రాజకీయ నేతలు రావడం వల్ల ఆ ప్రాంతం రాజకీయాలకు నిలయంగా మారింది

**విద్యార్థులకు నేర్పేది ఇదేనా?**

ఆస్తి కోసం రాజకీయాలు చేస్తూ ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటున్న రెండు వర్గాలు విద్యార్థులకు ఏం నేర్పిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు విద్యాబోధన చేస్తారా లేక రాజకీయాలు చేస్తారా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే భారత్ బైబిల్ కళాశాల మూతపడగా ఇప్పుడు, అదే సొసైటీ కి చెందిన నాజరీన్ పాఠశాల సైతం వీరి రాజకీయాల వల్ల మూతపడే అవకాశం ఉందని చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే నాజరీన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇతర పాఠశాలలో అడ్మిషన్లు పొందారని తెలుస్తుంది. ఈ రెండు వర్గాల మధ్య ఉన్న పోరు మా పిల్లలపై పడే అవకాశం ఉందని అందుకే పాఠశాలను మారుస్తున్నామని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**మూడో వ్యక్తికి బాధ్యతలు అప్పగించాలి**

ప్రస్తుతం నాజరీన్ పాఠశాలలో రెండు వర్గాల మధ్య జరుగుతున్న పోరు వల్ల విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని బిబిసి పూర్వ విద్యార్థి ముల్కాల భాస్కర్ ఆరోపించారు. రెండు వర్గాలకు చెందిన వ్యక్తి కాకుండా మూడో వ్యక్తికి నాజరీన్ పాఠశాల బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వీరి రాజకీయాల వల్ల భారత్ బైబిల్ కళాశాల మూతపడిందని, రెండు వర్గాల మధ్య పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే నాజరీన్ పాఠశాల సైతం మూతపడే ప్రమాదం ఉందని

దీనివల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని రెండు వర్గాలకు చెందిన వ్యక్తి కాకుండా మూడో వ్యక్తికి నర్సరీ పాఠశాల బాధ్యతలను అప్పగించాలని భాస్కర్ డిమాండ్ చేశారు.

# అస్తవ్యస్తమైన టౌన్ ప్లానింగ్ వ్యవస్థ గాడిలో పడేనా?





**కొత్త టౌన్ ప్లానింగ్ అధికారుల రాకతో ఆశలు**

**ఇకనైనా అక్రమ కట్టడాలకు బ్రేక్ పడేనా**

**కొత్త టౌన్ ప్లానింగ్ అధికారులకు సవాళ్లు**

మేడ్చల్, జూన్ 16( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిహెచ్ఎంసి కార్యాలయం తో పాటు, ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం పరిధిలో అస్తవ్యస్తంగా మారిన పట్టణం.. కొత్త టౌన్ ప్లానింగ్ అధికారుల రాకతోనైనా పట్టణ వ్యవస్థ గాడిలో పడేనా అని పట్టణవాసులు ఆశపడుతున్నారు. అక్రమం కట్టడాలు, అక్రమంగా వెలిసిన వెంచర్ల తో అస్తవ్యస్తంగా మారిన పట్టణాలు కొత్త టౌన్ ప్లానింగ్ అధికారులతో మార్పు వచ్చేనా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇంతకాలం మేడ్చల్ సర్కిల్ కు పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడం ఉన్న ఇంచార్జి టౌన్ ప్లానింగ్ అధికారి ఒకటి రెండు రోజులు మర్చిపోవడం తో పట్టణంలో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. సేమ్ ఎల్లంపేట మున్సిపల్ లో సైతం ఇదేవిధంగా ఉంది. అయితే ఇటీవల మేడ్చల్ సర్కిల్ కు పూర్తిస్థాయి ఏసిపి రావడం... ఎల్లంపేట మున్సిపాలిటీకి కొత్త టౌన్ ప్లానింగ్ అధికార రావడం తో పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

**మేడ్చల్ సర్కిల్ లో..**

రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న మేడ్చల్ పట్టణానికి ఇంతకాలం పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడం వల్ల టౌన్ ప్లానింగ్ అస్తవ్యస్తంగా ఉండేది. అనుమతులు ఒక రకంగా తీసుకొని నిర్మాణాలు మరో రకంగా చేపట్టిన చర్యలు తీసుకోవడంలో అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారులు వెనుకడుగు వేసేవారు. దీంతో మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ ఇతర ప్రాంతాలలో జోరుగా అక్రమ కట్టడాలు వెలిశాయి. ఇదేవిధంగా జోరుగా వెంచర్లను సైతం ఎలాంటి అనుమతులు లేకుండానే ఏర్పాటుచేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారు. ప్రస్తుతం మేడ్చల్ సర్కిల్ కార్యాలయానికి పూర్తిస్థాయి అసిస్టెంట్ సిటీ ప్లానర్ ( ఏసిపి ) భాస్కర్ గౌడ్ రావడంతో అక్రమ కట్టడాలు, అక్రమ వెంచర్ల కు పులిస్టాప్ పడనున్నాయని స్థానికులు భావిస్తున్నారు.

**ఎల్లంపేట మున్సిపల్...**

ఎల్లంపేట మున్సిపల్ లో సైతం అక్రమ కట్టడాలకు, అక్రమ వెంచర్లకు డోకా లేవు. ఇక్కడ సైతం అనుమతులు ఒక రకంగా తీసుకొని నిర్మాణాలు మరో రకంగా చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించారు. దీంతో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు వెలిశాయి. ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం చుట్టే అనుమతులు ఒక రకంగా తీసుకొని నిర్మాణాలు మరో రకంగా చేపడుతున్న భవనాలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడికి కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారి మహేష్ చంద్రకాంత్ తో అక్రమ కట్టడాలకు బ్రేక్ పడతాయని స్థానికులు భావిస్తున్నారు.

**కొత్త ఏసిపి, కొత్త టౌన్ ప్లానింగ్ అధికారులకు సవాళ్లు**

మేడ్చల్ సర్కిల్ కార్యాలయం తో పాటు ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయానికి కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులకు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న మేడ్చల్ తోపాటు ఎల్లంపేట మున్సిపాలిటీలో సరిదిద్దాల్సిన కట్టడాలు ఎన్నో ఉన్నాయి. కొన్నిటి వెనుక రాజకీయ నాయకుల అండ ఉండగా.. మరికొందరు చట్టాన్ని లైట్ గా తీసుకొని అక్రమ నిర్మాణాలను చేపట్టిన ఘటనలు ఉన్నాయి. వాటిని సరి చేయాలంటే కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులకు కత్తి మీద సామి అయ్యే అవకాశాలు ఉన్నాయి. చూడాలి కొంత టౌన్ ప్లానింగ్ అధికారులతో మాకు వచ్చేనా.

## పెంచక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

**185 మంది క్రీడాకారుల ప్రతిభా ప్రదర్శన.. జాతీయ స్థాయికి పలువురు ఎంపిక**



మేడ్చల్, జూన్ 17 ( మనం జిల్లా ప్రతినిధి): పెంచక్ సిలాట్ మార్షల్ ఆరట్స్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు మేడ్చల్లో ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14 నుండి జంగా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు.

మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిరి, సంగారెడ్డి, ఖమ్మం, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి మొత్తం 185 మంది విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రీ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.





ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాసిక్ జూన్ 25 నుంచి 28 వరకు జరగనున్న 14వ జాతీయస్థాయి పెంచక్ సిలాట్ పోటీలకు ఎంపికైనట్లు పెంచక్ సిలాట్ స్పోరట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ దశరథం, ప్రధాన కార్యదర్శి డి. దుర్గా సతీష్ గౌడ్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎంఆర్ స్కూల్స్ గ్రూప్ చైర్మన్ చామకూర శ్రీశైలం రెడ్డి, చామకూర సౌజన్య రెడ్డి, ముత్యాల గాంధీ యాదవ్, సిహెచ్ దశరథం హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా చామకూర శ్రీశైలం రెడ్డి, సౌజన్య రెడ్డి మాట్లాడుతూ పెంచక్ సిలాట్ అత్యంత ప్రాచీనమైన మార్షల్ ఆరట్స్ క్రీడ అని, ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే ఈ క్రీడకు స్పోరట్స్ కోటా సౌకర్యం ఉండటం వల్ల యువ క్రీడాకారులకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

పోటీలలో మంచిర్యాల జిల్లా క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్షిప్ ట్రోఫీని కైవసం చేసుకోగా, మేడ్చల్-మల్కాజిరి జిల్లా క్రీడాకారులు ద్వితీయ స్థానాన్ని సాధించారు.

రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల ఉత్సాహభరిత పాల్గొనికతో పోటీలు విజయవంతంగా ముగిశాయి. పెంచక్ సిలాట్ క్రీడాభివృద్ధికి ఇటువంటి పోటీలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షల

**కాంగ్రెస్ సీనియర్ నేత సాయి పేట శ్రీనివాస్**



మేడ్చల్, జూన్ 16 ( మనం జిల్లా ప్రతినిధి): పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న సందర్భంగా విద్యార్థులందరికీ గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ మాజీ జెడ్పిటిసి సాయి పేట శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు వెళుతున్న విద్యార్థిని విద్యార్థులందరూ ఈ విద్యా సంవత్సరంలో శ్రద్ధతో విద్యను అభ్యసించి ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని సూచించారు. వేసవి సెలవులు అనంతరం పాఠశాలలకు వెళుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఎం రేవంత్ రెడ్డి అన్ని సౌకర్యాలు కల్పించారని సాయి పేట శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత టెస్ట్ బుక్స్ నోట్ బుక్స్ వెళ్లాయని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లిన వెంటనే వాటిని అందజేస్తారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం అందించనుందని ఇప్పటికే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తుందని, తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులు సైతం అంకితభావంతో విద్యను అభ్యసించి ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని సాయిపేట శ్రీనివాస్ ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలను చిన్న చూపు చూడకూడదని, ప్రభుత్వ పాఠశాలలో సైతం ఇంగ్లీష్ విద్యను ప్రవేశపెట్టారని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను సాయిపేట శ్రీనివాస్ కోరారు



## తెలంగాణ యూనివర్సిటీలో అధ్యాపకుల పదోన్నతులు వెంటనే కల్పించాలి: టౌటా

సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014లో నియమితులైన అధ్యాపకులందరికీ రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ తుది తీర్పులకు లోబడి షరతులతో కూడిన పదోన్నతులు వెంటనే కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) డిమాండ్ చేసింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరిలకు టౌటా రాష్ట్ర నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టౌటా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, గత 12 ఏళ్లుగా పదోన్నతులు లేక అధ్యాపకులు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, సహజ న్యాయ సూత్రాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇక ఆలస్యం చేయకుండా పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పదోన్నతుల విషయంలో సానుకూల వైఖరితో ఉన్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ అధికారులు కూడా తక్షణ చర్యలు చేపట్టాలని వారు సూచించారు. పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కాకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమాలు చేపట్టే హక్కు ఉద్యోగులకు ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌటా ప్రతినిధులు డాక్టర్ ఏ. పున్నయ్య, డాక్టర్ మోహన్బాబు, డాక్టర్ అడికే నాగరాజు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమ, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.



## కెమికల్ గోదాంలో అగ్ని ప్రమాదం

**ఎగిసి పడిన మంటలు**
**ఫైర్ ఇంజన్లు వచ్చే ఆపిన మంటలు**
**ఈ ఘటనపై విచారణ ప్రారంభం**

మేడ్చల్, జూన్ 16 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల రాం రెడ్డి నగర్ లో ని సాల్వెంట్స్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కెమికల్ డ్రమ్ములు పేలడంతో పక్కనే ఉన్న స్క్రాప్ గోదాంకు వేగంగా మంటలు వ్యాప్తి చెందాయి దీంతో స్థానికులు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్లతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటన ఎలా జరిగింది, ఈ ఘటనతో ఎంత నష్టం జరిగింది, అనే అంశాలపై అధికారులు విచారణ చేపడుతున్నారు.

# రోడ్డు పనులను మరింత వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే





సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) రోడ్డు పనులను మరింత వేగవంతం చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి రాంగోపాల్ పేట డివిజన్ లోని కంచర్ బస్తీ, రంగ్రేజ్ బజార్ లలో వివిధ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలోని సమస్యల గురించి స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇరుకైన గల్లీలలోని బండలు దెబ్బతిని ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బండల ను తొలగించి సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణంకు ముందే అన్ని అంతర్గత రోడ్లలోని సీవరేజ్, వాటర్ పైప్ లైన్ ల లీకేజీలు ఏమైనా ఉన్నాయా, మరమ్మతులు చేపట్టాలా లేక నూతన పైప్ లైన్ ను ఏర్పాటు చేయాలా పరిశీలించాలని ఆదేశించారు. తిరిగి బండలు వేస్తే కొద్ది కాలానికే దెబ్బతింటాయని, సీసీ రోడ్లు నిర్మిస్తే దీర్ఘకాలం ఉంటాయని ఆయన స్థానికులకు వివరించారు. అనంతరం రంగ్రీజ్ బజార్ నుండి మహంకాళి అమ్మవారి ఆలయం వరకు చేపట్టిన రోడ్డు పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైనందున పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో అక్రమణ లు ఉంటే తొలగించాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాలు కూడా సమీపిస్తున్న దృష్ట్యా పనులను నాణ్యత తో వేగం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు ఇబ్బదులకు గురికాకుండా చూడాలని చెప్పారు. అదేవిధంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లో కాకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి సీవరేజ్ లైన్ ల సిల్ట్ తొలగింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పలు చోట్ల ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉండటం, వరిగిపోయి ఉండటాన్ని గమనించి వెంటనే వాటిని తొలగించి నూతన స్తంభాల ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, వాటర్ వరక్స్ డీజీఎం వెంకట్ రెడ్డి, ఏఈ చంద్రశేఖర్, ఎలెక్ట్రికల్ ఏఈ రవి, హార్టికల్చర్ అధికారి వికాస్, డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, మధు ముదిరాజ్, రాంమోహన్ యాదవ్, చంద్ర ప్రకాష్, కొండాపురం మహేష్ యాదవ్, ఆనంద్ పాటిల్, వినయ్, అరుణ్ భట్ తదితరులు ఉన్నారు.

# దక్షిణ మధ్య రైల్వేకు జాతీయ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ అవార్డు

సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) రైల్వే భద్రత, ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థల అమలు, సాంకేతిక నవీకరణలలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు దక్షిణ మధ్య రైల్వేకు ప్రతిష్ఠాత్మక జాతీయ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ (ఎస్టి) అవార్డు లభించింది. రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇన్స్టిట్యూషన్ ఆఫ్ రైల్వే సిగ్నల్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఈ), ఇండియన్ సెక్షన్, ఇన్స్టిట్యూషన్ ఆఫ్ రైల్వే సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్టీఈ) సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు, ప్రదర్శన-2026లో ఈ గౌరవం దక్కింది. న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో జూన్ 10 నుంచి 13 వరకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా రైల్వే జోన్లు, ప్రముఖ విద్యాసంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్యానికి అనుగుణంగా కృత్రిమ మేధస్సు ఆధారిత తదుపరి తరం రైల్వే నియంత్రణ, కమాండ్, సిగ్నలింగ్ వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, తయారీ అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రైల్వే జోన్లు, సంస్థలకు అవార్డులు




ప్రదానం చేశారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన జోన్ రైల్వేగా దక్షిణ మధ్య రైల్వే ఎంపికై జాతీయ ఎస్ అండ్ టి అవార్డును అందుకోవడం విశేషం. ముఖ్యంగా 'కవచ్' రైల్వే భద్రతా వ్యవస్థ అమలు, డిజిటల్ ఎలక్ట్రానిక్ ఇంటర్లాకింగ్ సిస్టమ్ల విస్తరణలో దక్షిణ మధ్య రైల్వే సాధించిన ప్రగతిని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. జోన్ వ్యాప్తంగా కవచ్ వెర్షన్ 4.0 అమలును వేగవంతం చేయడంతో పాటు విజయవంతంగా ట్రయల్స్ నిర్వహించడం ద్వారా దక్షిణ మధ్య రైల్వే కీలక మైలురాయిని చేరుకుంది. అలాగే ప్రధాన రైల్వే స్టేషన్లలో డిజిటల్ ఎలక్ట్రానిక్ ఇంటర్లాకింగ్ వ్యవస్థలను



ప్రవేశపెట్టి సిగ్నలింగ్ రంగంలో ఆధునికీకరణకు పెద్దపీట వేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 21 డిజిటల్ ఎలక్ట్రానిక్ ఇంటర్లాకింగ్ సిస్టమ్లను ప్రారంభించగా, 486 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ 4.0 వ్యవస్థను అమలు చేసింది. అదేవిధంగా 479 రూట్ కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ చర్యలతో రైలు ప్రయాణాల భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు రైల్వే కార్యకలాపాల సామర్థ్యం కూడా పెరిగింది. ఈ అవార్డు సాధించిన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ మురళీకృష్ణ తన బృందంతో కలిసి సికింద్రాబాద్లోని రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ విభాగం అధికారులు, సిబ్బంది అంకితభావాన్ని ప్రశంసిస్తూ, వారి సమిష్టి కృషి ఫలితంగానే ఈ జాతీయ స్థాయి గుర్తింపు దక్కిందన్నారు. రైల్వే భద్రత, సమర్థవంతమైన నిర్వహణ కోసం సిగ్నలింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థల ఆధునికీకరణ అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే ఉత్సాహం, పనితీరును కొనసాగించాలని సూచించారు.

# పీర్జాదిగూడ ప్రభుత్వ బడులకు బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు

**- ఆరుగురు విద్యావాలంటీర్లకు వేతనం**
**- కిచెన్ షెడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు చేయూత**
**- మాజీ కార్పోరేటర్లు, నాయకులతో కలిసి.. స్కూల్స్ సందర్శించిన మాజీ మేయర్ జక్క**
**- బీఆర్ఎస్ నాయకుల ఔదార్యంపై ప్రజల హర్షం-**





(మనం న్యూస్ జూన్ 16): మేడిపల్లి:మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలకు బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పోరేటర్లు, నాయకులు అండగా నిలిచారు. ఆరుగురు విద్యావాలంటీర్ల నియామకం చేసి, వారికి ప్రతి నెల వేతనం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అలాగే మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా కిచెన్ షెడ్డుతో పాటు పీర్జాదిగూడ, పర్వతాపూర్ స్కూల్స్‌లో కిచెన్ షెడ్ల మరమ్మత్తులు చేయిస్తామని హామీ ఇచ్చారు. నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు పుఃన ప్రారంభమైన నేపథ్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పోరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మేడిపల్లి, పీర్జాదిగూడ హైస్కూల్స్‌ను, పర్వాతాపూర్ అప్పర్ ప్రైమరీ స్కూల్ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అయితే మూడు పాఠశాలలకు కూడా పూర్తి స్థాయిలో అడ్మిషన్లు వస్తున్నప్పటికీ సాంక్షన్ పోస్టులు లేని కారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం జరగడం లేదని ఆయా స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు మాజీ మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మూడు స్కూల్స్‌లోను ఆరుగురు విద్యావాలంటీర్ల నియామకం చేసి, వారికి ప్రతినెల వేతనం మాజీ కార్పోరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మేడిపల్లి, పీర్జాదిగూడ, పర్వతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్డు నిర్మాణం, మరమ్మత్తులతో పాటు ఆరుగురు విద్యా వాలంటీర్ల నియామకం, వేతనం బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పోరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్ స్వచ్ఛందంగా స్వీకరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఔదార్యంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో సకల వసతులు కల్పించాలనే బీఆర్ఎస్ పార్టీ నాయకుల సంకల్పం ఆదర్శనీయమని ఆయా పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో....బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు,మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, శ్యామల శ్రీనివాస్, ఆంజనేయులు, కోనేటి వెంకట్,బుల్లెట్ శంకర్, అశోక్, మల్లం వెంకటేష్ గౌడ్, పాశం నరేందర్ రెడ్డి, సతీష్, అమర్ పటేల్, రాజు శెట్టి, కోల శ్రీనివాస్, వరికల శ్రీనివాస్, కిరణ్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, అక్షిత్, తిరుమలేష్, రమేష్, శివరాజ్, సుభాన్,సురేష్,



## సీనియర్ సిటిజన్ల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**- శ్రీనివాస్ నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక.**

ఏఎస్ రావునగర్, జూన్ 16 (మనం న్యూస్): సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 2026-2028 సంవత్సరాల కాలానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా కమిటీ సభ్యులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డితో కలిసి మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లు సమాజానికి మార్గదర్శకులని, వారి అనుభవం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజాన్ని సరైన దిశలో నడిపించడంలో వృద్ధుల పాత్ర కీలకమని, వారి సంక్షేమం కోసం అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

శ్రీనివాస్ నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గూడూరు సుదర్శన్ రెడ్డి ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా వి. సుభాష్ చంద్రబోస్, ఈసీ ఆదినారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మరోజు నర్సింహాచారి, సంయుక్త కార్యదర్శులుగా పి. రాములు గౌడ్, కె. కుటుంబరావు, కోశాధికారిగా ఎం. వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్. శ్రీనివాస్ గుప్తా, టి. శ్రీనివాసరావు ఎంపికయ్యారు.

**సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం**

ఈ కార్యవర్గాన్ని కాలనీ సంక్షేమ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ (నాగు) నామినేట్ చేయగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలిపి ఎన్నిక చేశారు. నూతన కమిటీ సీనియర్ సిటిజన్ల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించింది.

## మల్కాజ్గిరిలో అక్రమ హుక్కా సెంటర్లపై పోలీసుల ఉక్కుపాదం

**నాలుగు కేసులు నమోదు.. ఏడుగురు అరెస్ట్..**





మేడ్చల్, జూన్ 16 ( మనం జిల్లా ప్రతినిధి): మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్లు, కేఫ్లపై స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు.
విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ 15న చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 14 హుక్కా సెంటర్లు, కేఫ్లను ఎస్ఓటి పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాలుగు సంస్థలపై కేసులు నమోదు చేశారు. అలాగే అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. హుక్కా సెంటర్ల నిర్వహణ వల్ల ప్రజారోగ్యానికి, శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని మల్కాజ్గిరి పోలీసులు పేర్కొన్నారు. కేఫ్లు, హుక్కా సెంటర్ల నిర్వాహకులు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే వ్యాపారాలు నిర్వహించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సామగ్రిని స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఎక్కడైనా అక్రమ హుక్కా సెంటర్లు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ ప్రత్యేక దాడులు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో, ఎస్ఓటీ ఇన్చార్జ్ డీసీపీ కె. మనోహర్ మార్గదర్శకత్వంలో నిర్వహించారు.

## ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను 20వేల నియామకాలతో భర్తీ చేయాలి: మోతిలాల్ నాయక్




సికింద్రాబాద్, జూన్ 16 (మనం న్యూస్) ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను 20వేల తో భర్తీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషను విడుదల చేయాలని తెలంగాణ నిరుద్యోగ జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు ఉస్మానియా యూనివర్సిటీలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం 5 వేలతో నోటిఫికేషన్ ఇస్తే జీవో నంబర్ 46 ప్రకారంగా రెండు వేల ఉద్యోగాలు హైదరాబాదుకు పోతాయని మిగిలిన 3000 ఉద్యోగాలు రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాలకు పోతాయని అన్నారు. మూడు వేల ఉద్యోగాలు 33 జిల్లాలకు పోతే కులానికి ఒక్క పోస్టు నిరుద్యోగులు పంచుకోవాలని అన్నారు. అందువలన రాష్ట్ర ప్రభుత్వం ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలను ఐదువేలతో కాకుండా ఇరవై వేలతో కూడిన నోటిఫికేషన్ ఇవ్వాలని లేనియెడల రాష్ట్రంలో అగ్నిగుండాన్ని సృష్టిస్తామని అన్నారు. ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఒక ఉద్యమాన్ని లేవనెత్తుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. అలాగే నోటిఫికేషన్ లో లాంగ్ జంప్ ను 3.5 మీటర్లకు కుదించాలని అన్నారు. ఎస్సై వయోపరిమితిని 36 సంవత్సరాలకు తగ్గించి కానిస్టేబుల్ వయోపరిమితిని 38 సంవత్సరాలకు పెంచాలని అన్నారు. జీవో నెంబర్ 46ను రద్దుచేసి అప్లికేషన్ ఫీజును వెయ్యి రూపాయల నుంచి వంద రూపాయలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరితో వెళితే 33 జిల్లాలలో ఉన్న నిరుద్యోగ యువత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జెఏసి మహిళా అధ్యక్షురాలు అస్మా, జనరల్ సెక్రటరీ ఆర్ కె. వన్నార్ చోళ, అనిత ముదిరాజ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.